


*(గత సంచిక తరువాయి)*

## 22

### 2008

- కేంద్ర ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకిచ్చిన ₹60,000 కోట్ల ఋణాల మాఫీ.

వినోద్ కంప్యూటర్ లో రిపోర్ట్ లు చూస్తున్నాడు. ప్రపంచంలోని అన్ని దేశాల బ్యాంకులు , అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ని న్యూ యార్క్ లో అక్కడి బ్యాంక్ బ్రాంచ్ లో ఓ అకౌంట్ తెరచి ఉంటారు. అక్కడే ఎగుమతి, దిగుమతుల వంటి లావాదేవీలు డాలర్ రూపేన బ్యాంకులు మార్పిడి చేసుకుంటాయి. అలానే అక్కడి రిజర్వ్ బ్యాంకు, ఆదాయ పన్ను శాఖ – ఐ ఆర్ ఎస్ లు, అమెరికా బ్యాంకులు ప్రపంచ వ్యాప్తంగా జరిగే లావాదేవీలపై ఓ కన్ను వేసి వుంటారు. ఉదాహరణకు పది వేల డాలర్ల కంటే ఎక్కువ చెక్కు కానీ, డబ్బు మార్పిడి అనుమానాస్పదంగా జరిగితే, బ్యాంకులు ఐ ఆర్ ఎస్ కు రిపోర్ట్ చేయాలి.

వినోద్ అమెరికా దేశం లో భారత దేశ సంబంధం కల అకౌంట్ల వివరాలు చూస్తున్నాడు. సెర్చ్ లో అకౌంట్ పేరు కానీ, స్థలం పేరు కానీ, ఆ అకౌంట్లు తెరిచిన వ్యక్తుల పేర్లు కానీ ఇచ్చి, వివిధ రకాలు గా కావలసిన సమాచారం వేదుక్కోవచ్చు. క్షణాలలో ఆ వివరాలన్ని కంప్యూటర్ తెర మీద ప్రత్యక్ష మౌతున్నాయి.

ఇది ఆ దేశానికి ఎలా సాధ్యం అయ్యింది. దీని వల్ల అమెరికా దేశంలో ఉన్న బ్యాంక్ వివరాలు ఐ ఆర్ ఎస్ కు, తెలిసినట్లు, భారత దేశంలోని బ్యాంకుల వివరాలను ఇక్కడి ఆదాయ పన్ను శాఖ కు తెలిసే లా ఎలా చేయడం? వినోద్ కు గత కొద్ది ఏండ్లు అమెరికా లో కొత్తగా ఆర్థిక నేరాలను అరికట్టడానికి ఏర్పాటు చేసిన FINCEN ఉద్యోగులతో పని చేయడం వల్ల, అక్కడి సిస్టమ్స్ బాగా పరిచయమే.

అమెరికాలో ప్రతీ వ్యక్తికి సోషల్ సెక్యూరిటీ నంబర్ ఇస్తారు. ఈ నంబర్ లేక పోతే ఉద్యోగాలు దొరకవు, బ్యాంక్ లు అకౌంట్లు తెరవడానికి నిరాకరిస్తాయి, దాదాపు బ్రతకడం కష్టం. అలానే అన్నీ బిజినెస్ లకు టాక్స్ ఐడెంటిఫికేషన్ నంబర్లు ఇస్తారు. ఈ నంబర్ల వల్ల ఆర్థిక లావా దేవిలన్ని కంప్యూటర్ మీద ఎక్కించడం సులభం. అప్పటికే భారత

దేశంలో, ఆదాయ పన్ను శాఖ పర్మనెంట్ అకౌంట్ నంబర్ అని PAN నంబర్లు ప్రవేశ పెట్టినా, ఇవి ఆదాయ పన్ను కట్టే వారికే అవసరం. అమెరికా లో సోషల్ సెక్యూరిటి నంబర్ లాగా, ప్రతీ వ్యక్తిని గుర్తించే ఓ కొత్త నంబర్ సిస్టం, భారత దేశం లోనూ మొదలెట్టాలి. ఈ మధ్యనే ఇలాంటి ప్రతిపాదన పలు శాఖల నుండి రావడంతో, ముంబై లో ఓ కాన్ఫరెన్స్ పెట్టారు. తాను కూడా పాల్గొన్నాడు. అక్కడే ఆధార్ కార్డ్ నంబర్ అన్న ప్రతిపాదన మొదటి సారిగా విన్నాడు. అది వస్తే భారత్ దేశం కూడా ఇలా అమెరికా దేశంలా నిమిషాల మీద కంప్యూటర్ సహాయంతో, ఆర్థిక లావాదేవీలు పరిశీలించవచ్చు, ఇతర దేశాలతో ఆ సమాచారం పంచుకోవచ్చు, ఆర్థిక నేరాలు అరికట్ట వచ్చు.

ఎదురుగా పి.ఎల్. సాయంత్రం పార్టీ కని పంపించిన ఆహ్వాన పత్రిక ఉన్న కవర్ కనిపించింది. అప్పుడే పి.ఎల్ కొడుకు కాలేజి చదువులకు వచ్చేసాడా? ఓ ఐదారేళ్లు పి.ఎల్ తోను, ఆయన బిజినెస్ తోను టచ్ పోయింది. పి.ఎల్.గ్రూప్ ఓ తారాజువ్వాలాగా ఎదగడం పేపేర్ల ద్వారా, టి.వి. ఛానళ్ల వార్తల ద్వారా, వ్యాపార ప్రకటనల వల్ల, వినోద్ కు తెలుస్తూనే ఉంది.

పి.ఎల్. గ్రూప్ గుర్తుకు వస్తూనే, అప్రయత్నంగా వినోద్ కంప్యూటర్ లో పి.ఎల్ గ్రూప్ కంపెనీల పేర్లు టైప్ చేసాడు. ఆ గ్రూప్ కంపెనీ ల పేర్లతో కంప్యూటర్ లో వెదికితే ఏమి అనుమానస్పదంగా దొరకలేదు. అమెరికాలో పి.ఎల్. గ్రూప్ కి పని చేస్తున్న ఉన్నతాధికార్ల పేర్ల తో వెదికితే ఆశ్చర్యం, సైప్రెస్ లో ఓ కొత్త అకౌంట్ కొన్ని నెలల ముందు తెరచినట్లు తెలిసింది. పి.ఎల్ గ్రూప్ కి సైప్రస్ లో ఏమి పని. సైప్రెస్ కూడా పన్నులు ఎగ గొట్టాలనుకొనే బినామీ కంపెనీలకు పుట్టిల్లు. ఏదో అనుమానస్పదంగానే ఉంది, ఇంకా కొంచెం చూడాలి అనుకున్నాడు. సాయంత్రం అయ్యిపోయింది, పి.ఎల్. పార్టీ ఎక్కడ పెడుతున్నాడు అని ఎదురుగా ఉన్న కవర్ లోని కార్డు తీసి చదివాడు.

అరసు వీడ్కోలు వేడుకలకని ఏర్పాటు చేసిన హోటల్ కి, పి.ఎల్ వెళ్లే సరికి దాదాపు అతిధులందరు

వచ్చేసారు. డబ్బు సమస్య లేదు కాబట్టి పార్టి చాలా అందంగా హోటల్ పూల్ పక్కన లాన్స్ లో అమర్చారు. పి.ఎల్. రాగానే పూల మధ్య ఉన్న వేదిక పైకి తీసుకెళ్లి మాట్లాడ మన్నారు. పి.ఎల్. వేదిక పైకి, అరసును, కని చెల్వి ని పిలిచి పరిచయం చేసాడు. అరసు పై చదువులు చదివిన తరువాత పి.ఎల్. గ్రూపు కంపెనీ లలో నే చేరుతాడని, అరసు దానికి కావలసిన విధంగా చదువుతాడాని తన నమ్మకం అని చెప్పాడు. పి.ఎల్. అటు తరువాత తన దగ్గర వరుసగా వస్తున్న అతిధుల ను పరామరిస్తూనే, అరసు ఆయష వైపు పోవడం గమనించాడు. వారిద్దరి కళ్ళలో కనిపించిన మెరుపు, పి.ఎల్ దృష్టిలో పడక పోలేదు.

ఆయష అన్న సలీం తో పాటు వచ్చింది. ఇద్దరిని, అరసు నే పిలిచాడు. సలీం ఢిల్లీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఇఫ్ మెడికల్ సైన్సెస్ లో చదువుతున్నాడు.

చిన్నప్పటి నుండి స్నేహితులైనందు వల్ల వెంటనే మాటల్లో పడిపోయారు ముగ్గురు.

"ఎలా ఉంది నీ మెడికల్ కాలేజ్ సలీం", అన్నాడు అరసు.

"కాలేజి కేమి బాగానే ఉంది. మమ్మల్నే బాగా తోముతున్నారు. పి జి కి సీటు వస్తుందో రాదో టెన్షన్ గా ఉంది. నా సంగతేమిలే, నీవు పోయేది కొత్త దేశం కదా నీ మూడ్ ఎలా ఉంది", అన్నాడు సలీం.

"కొత్త దేశం ఏమి కాదులే. అప్పుడప్పుడు నాన్న తో సెలవులని విదేశాలకు పోతూనే ఉన్నాము. ఈ దేశానికి కూడా వెళ్ళాము. కాదంటే కాలేజి కొత్తనే. నాన్నకు తెలిసిన వాళ్లున్నారు కాబట్టి, తొందరలోనే సెటిల్ అయ్యిపోగలను. ఒకసారి క్లాస్మేట్లను కలిస్తే పండగే. మరి నీ సంగతేమిటి ఆయష", నవ్వుతూ అన్నాడు అరసు.

"నువ్వేళ్తున్నావు కదా, వచ్చే సంవత్సరం నేను వచ్చేస్తా. జి.ఆర్.ఈ, టోఫెల్ పరీక్షల కు ప్రిపేర్ అవ్వుతున్నాను", అంది ఆయష.

"నేనెక్కడ వెళ్తే అక్కడొస్తావా", కొంటెగా అన్నాడు అరసు. సలీం కు వీళ్లిద్దరూ చిన్నప్పటి నుంచి టామ్ , జెర్రీ ల లాగా ఏడిపించుకుంటూనే ఉండడం చూసాడు కాబట్టి నవ్వుతూ ఆయష ఏమి జవాబు ఇస్తుందో అని చూసాడు.

"నీ సంగతే చెప్తునట్లున్నావు. నీవే కదా ఇప్పుడు ఇక్కడికి వచ్చింది. నువ్వు పోయే యూనివర్సిటీ కూడా నా వెంట బడి, స్కాలర్షిప్ ఇచ్చి రమ్మంటేనే వస్తా", పొగరుగా అంది ఆయష .

ఆ పొగురే అరసుకు నచ్చింది. ఉత్త పొగురే ఉంటే అంత ఆకర్షణ ఉండేది కాదేమో. పొగరుగా అనిపించే మాటల వెనక ఉన్న నిజం ఆ మాటలను, ఆయష అందాన్ని మరింత ఎక్కువ చేస్తాయి.

"నీకు స్కాలర్షిప్ రాకపోవడం ఏమిటి. ఆ యూనివర్సిటీ నే కాదు నువ్వు అప్లై చేసిన ప్రతీ యూనివర్సిటీ నీకు స్కాలర్షిప్ ఇస్తుంది. నీవే దయతలచాలి అరసు మీద, అరసు యూనివర్సిటీ లో చేరడానికి",అన్నాడు సలీం ఆయష వైపు మెప్పుకోలుగా చూస్తూ.

"నా యూనివర్సిటీ లో నువ్వు చేరొద్దులే, నా బార్ తిరుగుళ్లు తగ్గిపోతాయి", అన్నాడు అరసు.

వాళ్ళు నవ్వులాట అలా సాగుతుండగానే, కొంత దూరంలో పి.ఎల్ తో కొందరు బిజినెస్ గురించి, కొత్తగా వచ్చిన ఇన్కమ్ టాక్స్ కమీషనర్ గురించి మాట్లాడం మొదలెట్టారు.

"మొన్ననే అగర్వాల్ గ్రూప్ మీద ఐ టి రైడ్ అయ్యింది తెలుసా. వాళ్ళ ఇంట్లో ఉండే నగలు, క్యాష్ తో బాటు బ్యాంక్ లోని లాకర్లు సీల్ చేశారు...", అంటున్న వ్యక్తి ఉన్నటుండి, మాటలాపి, పి.ఎల్. వైపు వస్తున్న వ్యక్తి వైపు నోరు అలానే తెరిచి ఆశ్చర్యంతో చూడ సాగాడు.

పి.ఎల్. ఆ కొత్త వ్యక్తిని గుర్తు పట్టి, "వినోద్ మళ్ళీ కలవడం సంతోషంగా ఉంది. ఐ టి ఆఫీసుకు కమిషనర్ గా నిన్ను నియమించారని తెలిసిన వెంటనే నిన్ను కలవాలనిపించింది. అందుకే ఈ పార్టీకి పిలిచా. వచ్చినందుకు సంతోషం", అని పలకరించి, ఆప్యాయంగా వినోద్ భుజం నొక్కాడు.

"మీరు నా మొదటి ఉద్యోగం రోజుల నుంచి తెలుసు. మీరు పిలవడం, నేను రాకపోవడమా. మీరు చిన్న పార్టనర్ షిప్ పరిశ్రమ నుండి ఈ స్థాయి దాకా మీ బిజినెస్ పెంచడం చాలా గొప్ప విషయం. మొన్ననే సైప్రస్ లో కూడా ఓ బ్రాంచ్ తెరిచారని విన్నాను", మెప్పుకోలు గా అన్నాడు వినోద్, పి.ఎల్.వైపు చూస్తూ

"అబ్బే బిజినెస్ మాటలు ఎందుకులే వినోద్. పార్టీ ఎంజాయ్ చేయి. వీళ్లు కూడా నీకు తెలుసనుకుంటాను. అరసును కలిసావా? ", అని వినోద్ మాటల పై, తన ఆశ్చర్యం కప్పిపుచ్చుతూ అన్నాడు పి.ఎల్.

వినోద్ తో కొంత సేపు మాట్లాడి న తరువాత, పి.ఎల్.ను కలవాలని మరో కొత్త గుంపు రావడంతో వినోద్ పి.ఎల్ నుండి వీడ్కోలు తీసుకొని తనకు తెలిసిన మరో గుంపు వైపు వెళ్ళిపోయాడు.

దూరంగా మహేష్ కదులుతూ కనిపించాడు పి.ఎల్ కు.

మహేష్ కి దూరం నుంచే చేతులూపాడు పి.ఎల్.

కొద్దీ సేపు అలా సోషల్ మీటింగ్ తరువాత అథితులందరూ సెట్ చేసిన టేబుల్, కుర్చీలలో కూర్చుంటే, సర్వర్ లు అడిగి అడిగి వడ్డించారు. డిన్నర్ తరువాత పి.ఎల్. కారువైపు వెళ్లబోతుంటే, మహేష్ పి.ఎల్ ను అనుసరించాడు. పి.ఎల్. కనిచెల్వి, అరసు ఇంకా వాళ్ళ స్నేహితులతో మాట్లడుతూ ఉన్నారు. ఇంటికి పోవడానికి ఎవరికి వారికి, వేరే కార్లు, డ్రైవర్ లు ఉన్నారు.

పి.ఎల్. తో బాటు మహేష్ కారులో ఎక్కాడు. ఇందాక పి.ఎల్.మహేష్ కు చేతులూపింది తనతో కార్లో రమ్మనే. మహేష్ తన కారు డ్రైవర్ ను, పి.ఎల్. కారును అనుసరించమని, ఇదివరకే చెప్పాడు.

పి.ఎల్ కారు కదలగానే, "మహేష్, వినోద్ మన పార్టీకి వచ్చాడు చూసావా", అని అడిగాడు.

"అవును సార్. చూసాను. చాలా కబుర్లు చెప్పాడు కూడా. డిపార్ట్మెంట్ లో అతనికి మంచి పేరుందని కూడా విన్నాను", అన్నాడు మహేష్.

"సైప్రెస్ లో మన బ్రాంచ్ ఉన్నట్లు ఎవరికి తెలుసు?", అడిగాడు పి.ఎల్.

"విదేశాలలో ఉన్న మన పార్టనర్ కి, ఆ దేశం బ్యాంక్ ఉద్యోగులకి, ఇక్కడ మన ఇద్దరికి తప్ప ఎవరికి తెలిసి ఉండకూడదు", అన్నాడు మహేష్.

"వినోద్ మాట్లాడిన మొదటి మాటలు సైప్రెస్ గురించే", ఆశ్చర్యం తో అన్నాడు పి.ఎల్.

"సైప్రెస్ బ్రాంచ్ గురించి మనం ఎక్కడ ప్రస్తావించలేదు. అది మన విదేశీ, బిజినెస్ కోసమే ప్రారంభించాము. ఆ కంపెనీ మన పి.ఎల్. గ్రూప్ దని తెలిసినా, మనకు నష్టం ఏమి లేదు. ఇంతవరకు పెద్ద ఎతున్న డబ్బు ఆ అకౌంట్లో వేయలేదు. వినోద్ ఆ అకౌంట్ ప్రసక్తి తెచ్చాడు కాబట్టి, ఇక మీద వేయ దల్చుకోలేదు కూడ ", అన్నాడు మహేష్.

"ఎందుకైనా మంచింది, మన పార్టనర్ లియో పరిచయం చేసిన పనామా లాయర్ల ను, నువ్వు అరసును కాలేజ్ లో చేర్పించాడానికి వెళ్లి వచ్చేటప్పుడు కలువు. సైప్రస్ విషయం ఇక్కడ టాక్స్ వాళ్లకు తెలిసిందని, వాళ్లతో మన విదేశీ అకౌంట్లు అన్ని ఓ సారి రివ్యూ చేయి", అంటూ డ్రైవర్ కు కారు ఆపని ముందున్న సీట్ వెనుక తట్టాడు, పి.ఎల్.

కారు ఆగగానే, " సరే నేను కలుస్తాను లెండి. ఇక్కడ కూడా నాకు తెలిసిన వారితో వాకబు చేస్తాను. మళ్ళి కలుస్తాను సార్", అని మహేష్, కారు దిగి వెనుక ఫాలో అవ్వుతూ ఆగిన తన కారు వైపు అడుగులు వేసాడు.

## – 23 –

సెయింట్ పీట్, ఫ్లోరిడా

అక్టోబర్, 2014

విశ్వం కు లక్ష్మితో మాట్లాడాలనిపించింది. ఫోన్ చేస్తే వెంటనే తీసుకుంది లక్ష్మి. ఈ మధ్యనే వచ్చిన మార్పు ఇది. తనకు కాన్సర్ అని బయట పడకుండానే బాధ పడుతున్నది సీత అని తెలుసు. లక్ష్మీ కూడానా?

"బంగారు, ఏలా ఉన్నావమ్మా? నీకు అమ్మ ఈ పాటికే చెప్పేసి ఉంటుంది. సర్జన్ మార్చాను. ఆపరేషన్ వచ్చే వారం బదులు మరో మూడు వారాలలో ఉంది. మన ఫ్యామిలీ డాక్టర్ క్లియరెన్స్ అప్పుడే ఇచ్చేసాడు. ఇక కార్డియోలోజిస్ట్ దగ్గర

పోవాలి. ఇంత వరకు ఆ డాక్టర్ దగ్గర పోవాల్సిన అవసరం పడలేదు. ఈ రోజు మధ్యాహ్నం ఆ అప్పాయింట్మెంట్ ఉంది. ఇక నీ సంగతి చెప్పు. ఎలా ఉంది నీ కొత్త కంపెనీ?", అన్నాడు విశ్వం.

"గుడ్ మార్నింగ్ నాన్న. బాగానే నడుస్తున్నది. మొన్ననే ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వాళ్ళ కాంట్రాక్ట్ దొరికింది. వారికి ఒక బ్యాంక్ నుంచి మరో బ్యాంక్ కు  పోయే  లావాదేవీల మీద ఓ టూల్ కావాలన్నారు. అదే పని మీద ఉన్నా. అలానే కొన్ని కొత్త ప్రొడక్ట్స్ తయారు చేస్తున్నాను. అన్నట్టు మీ ఆరోగ్యం బాగానే ఉంది కదా? ఆపరేషన్ తరువాత అన్నీ బాగై పోతాయిలే నాన్న. బ్యాక్ టు నార్మల్ అయ్యిపోతాం", అంది లక్ష్మి.

" కాంగ్రేట్స్ బంగారు.  నా ఆరోగ్యం బాగానే ఉందమ్మ. ఆరోగ్యం అంటే గుర్తుకు వచ్చింది. డాక్టర్ల కోసం 'డు నాట్ రెసూసియేట్(డి.ఎన్. ఆర్)' సూచనలు  రాసి పెట్టాను. ఆపరేషన్ లో కాంప్లికేషన్ వచ్చి బ్రెయిన్ డెడ్ అలా అయితే ట్యూబులు సపోర్ట్ సిస్టమ్స్ తీసేయాలి అని. నిన్ను, సీతను అడుగుతారేమో, ఒక వేళ ఆ పరిస్థితి వస్తే. ఆ పేపర్, ఈ సారి ఇంటికి వచ్చినప్పుడు, నీకు ఎక్కడ పెట్టానో చెప్తాలే", అన్నాడు విశ్వం.

"సరే నాన్న. అలానే మీరు విల్లు రాసారా? అది కూడా ఎక్కడ ఉందో చెప్పండి", అంది లక్ష్మి.

ఒక్క నిమిషం అవాక్కైయాడు విశ్వం. మళ్లీ లక్ష్మి చేస్తున్నది కరెక్టే అనిపించింది. ఈ విషయాలలో మొహమాట పడటం అనవసరం. ఎంత మంది భార్యలు, భర్తల ఆకస్మిక మరణాల తరువాత, విల్లు లేకుండా కష్టపడలేదు.

"ఆ విల్లు కూడా రాసాను. సీతకు తెలుసు. విల్లు ఆ డి.ఎన్.ఆర్ పేపేర్లతో బాటు ఎక్కడుందో చెప్తాను", అని చెప్పి ఫోన్ పెట్టేసాడు విశ్వం.

ఓ పది నిమిషాలలో మీటింగ్. మీటింగ్ బ్రిడ్జి ఓపెన్ చేసిన తరువాత జూలి అటు తరువాత బెత్ వచ్చారు. జూలి కి కూడా మీటింగ్ అనుభవం కావాలని, విశ్వం ను నెలకి ఓ రెండు వారాలైన జూలి మీటింగ్ నడిపితే, విశ్వం దానికి సపోర్ట్ చేయాలని చెప్పింది.

విశ్వంకు మొదట చిర్రు మని కోపం వచ్చినా, ఎలా ఆపరేషన్ కి తనకు సెలవు కావాలి, ఆ సమయంలో బెత్ లేక జూలి నో తన మీటింగులు నడపాల్సిందే. జూలి కి ట్రైనింగ్ ఇస్తే ఆ సమస్య ఉండదు.

"బెత్ దానికేముంది. తప్పకుండా నేర్పిస్తాను. ఎలాను నేను ఓ హెల్త్ ఇష్యూ మీద రెండు వారాలు లీవు తీసుకోవాలి. అప్పుడు నా మీటింగులు జూలీ నడపచ్చు. నేనే ఈ విషయం మీకు చెపుదాం అనుకుంటున్నాను", అన్నాడు విశ్వం.

బెత్ ముఖంలో రంగులు మారాయి. విశ్వం మనస్సులో మళ్లీ అలజడి మొదలయ్యింది. బెత్ ఉద్దేశ్యం ఏమిటి? జూలి ని తన ప్లేస్ లో వేయాలనేనా? బెత్ మాట్లాడే లోపలే, మిగిలిన ప్రాజెక్ట్ సభ్యులు మీటింగ్ జాయిన్ అవ్వడంతో, విశ్వం మీటింగ్ మొదలెట్టాడు.

మధ్యాహ్నం కార్డియోలోజిస్ట్ అన్నీ సరిగ్గా ఉన్నా క్లియరెన్స్ ఇవ్వనన్నాడు. విశ్వంకు నిజంగానే కోపం వచ్చింది.

"స్ట్రెస్ టెస్ట్ చేశారు, వెయిన్స్ కు అల్ట్రా సౌండ్ చేశారు. అన్నీ నార్మల్ గానే ఉన్నాయి. ఆపరేషన్ కి అభ్యంతరం లేదని ఎందుకు చెప్ప లేక పోతున్నారు", చిరాకుగా అన్నాడు విశ్వం.

"మిమ్మల్ని వాస్క్యూలర్ సర్జన్ దగ్గర పంపిస్తాను. అర్జెంట్ అంటే ఎమర్జెన్సీ కి పంపిస్తాను. వాళ్ళు సరి అంటే నేన మీకు క్లియరెన్స్ ఇస్తాను", అన్నాడు కార్డియోలోజిస్ట్.

విశ్వం కు ఈ కార్డియోలోజిస్ట్ తన జాగ్రత్త కోసం విశ్వం ను పరుగులు తీయిస్తున్నాడని అర్థం అయ్యింది. బహుశా ఇంకో కార్డియోలోజిస్ట్ దగ్గరకు వెళ్లితే ఈ సమస్య ఉండేది కాదేమో. కానీ ఇప్పుడు ఈ అసహాయ స్థితిలో వాస్క్యూలర్ సర్జన్ దగ్గర పోవడం ఒకటే మార్గం. వాస్క్యూలర్ సర్జన్ ఆఫీసుకు ఫోన్ చేస్తే వచ్చే వారం అప్పాయింట్మెంట్ ఉందని చెప్పింది ఫ్రంట్ డెస్క్ లో ఉన్నావిడ. రెండు వారాలలో తనకు కాన్సర్ ఆపరేషన్ ఉందని కొంచెం బ్రతిమాలితే, మరుసటి రోజు పొద్దున్నే అప్పాయింట్మెంట్ ఇచ్చింది.

బెత్ కు కోపం వస్తుందని తెలిసినా, అవసరం కాబట్టి పొద్దున రెండు గంటలు ఆలస్యంగా రావడానికి అర్జీ పెట్టుకున్నాడు విశ్వం.

వాస్క్యూలర్ సర్జన్ మంచి వాడే. విశ్వం కేస్ సాంతం చదివి, బహుశా అతనికి వెంటనే క్లియరెన్స్ ఇవ్వవచ్చేమో అని కూడా ఆలోచించాడు. కానీ కార్డియోలోజిస్ట్ రాసిన రెఫరల్ వల్ల, ఓ చిన్న ఫిల్టర్, ఆపరేషన్ చేసి నడుము ప్రాంతంలో నున్న రక్త నాళంలో పెడతానని, అది తన కాన్సర్ ఆపరేషన్ తరువాత తీసివేయొచ్చు నని చెప్పాడు. ఆపరేషన్ వల్ల ఏదైనా బ్లడ్ క్లాట్ వస్తే అది కాళ్ళ లో ఏర్పడి, ఊపిరి తిత్తుల, గుండెలకు ఎగబాకుతుందని, ఈ ఫిల్టర్ అలా పైకి పోకుండా ఆపేస్తుందని వివరించాడు. చిన్న ఔట్ పేషెంట్ ప్రొసీజర్ కాబట్టి సమస్య ఉండదని, సరే నంటే వచ్చే వారమే ఏర్పాటు చేస్తానని చెప్పాడు. తన కోసం, కేలండర్ బుక్ అయ్యిపోయినా, ప్రొసీజర్ కి ఒప్పుకున్నాడని విశ్వం ఆ సర్జన్ కి థాంక్స్ చెప్పి బయట పడ్డాడు.

విశ్వం తో పాటు సర్జన్ ను కలవడానికి వచ్చిన సీత, విశ్వం ముఖంలో ఆదృత, అసహాయత,బాధ, చూసి

"ఎక్కడైనా ఓ రెండు రోజులు ఈ వీకెండ్ పోదామా? లక్ష్మీ కూడా ఇంటికి వస్తానంది", అంది సీత.

విశ్వంకు రాబర్ట్ ఇచ్చిన అడ్రెస్సులు తటుక్కున గుర్తుకు వచ్చాయి.

"క్రూయిజ్ పోదాం సీత. కేయ్ మాన్, బహామాస్ ద్వీపాలకి వీకెండ్ క్రూయిజ్ లో లాస్ట్ మినిట్ డీల్స్ ఉన్నాయేమో చూడు. ఎలా ఈ ఊరు నుంచే కదా క్రూయిజ్", అన్నాడు విశ్వం.

రాబర్ట్ ఇచ్చిన అడ్రెస్సులలో ఒకటి కేయ్ మాన్ ద్వీపంలో ఉంది. అది కూడా చెక్ చేయ వచ్చునేమో అని విశ్వం ఆశ. మళ్ళీ విశ్వం మనస్సు మరో వైపు ఊగ సాగింది. ఎందుకీ వెంపర్లాట. తన భవిష్యతే అగమ్యగోచరంగా ఉంది. పిరమిడ్ గ్రూపు ఏమి చేస్తే తనకేమిటి?

సీత క్రూయిజ్ కంపెనీ కి ఫోన్ చేసి 3 టికెట్లు రిజర్వ్ చేయగలిగింది. ఎప్పుడు తమతో రావడానికి, సవాలక్ష ప్రశ్నలేసే లక్ష్మి కూడా వెంటనే క్రూయిజ్ కి ఒప్పుకుంది.

## - 24 -

2012

- ప్రభుత్వం 2G స్పెక్ట్రమ్ కింద ఇచ్చిన 122 లైసెన్సులు రద్దు చేస్తూ, సుప్రీం కోర్టు తీర్పు. లైసెన్సులు ఇవ్వడంలో అవినీతి ఆరోపణలు.

సిద్దార్ద్ బెనర్జీ , విజేత బెనర్జీ వాళ్ళ కూతురు రీమ తో బాటు పి.ఎల్. ఇంటికి భోజనానికి వచ్చారు. కొత్తగా కట్టిన కోట లాంటి ఇంటికి కొద్ది రోజుల క్రితమే పి.ఎల్. మారాడు. ఇంటి గురించి, ఇంట్లోని ఇంటీరియర్ అలంకరణ గురించి, గరాజి లో ఉన్న కార్ల గురించి అప్పటికే అన్ని భాషలలో ఉన్న పత్రికలు, టి.వి. చానెళ్లు వివరంగా, బొమ్మలతో పాటుగా వేసేసి డబ్బులు చేసుకున్నారు. సిద్దార్ద్ కుటుంబంకి కూడా ఆస్తులకి తక్కువలేదు. ఓ పాతిక సంవర్సరాలు మకుటం లేని మహారాజులా సినీ రంగాన్ని ఏలేశారు. సిద్దార్ద్, విజేత టాప్ హీరో, హీరోయిన్ గా ఉన్నపుడే ప్రేమలో పడి పెళ్లి చేసుకున్నారు. వీరి కూతురు రీమ కూడా బాగా పేరుండి నిలదిక్కుకున్న నటినే.

పి.ఎల్. తన సమకాలీనుడే అయ్యినా, ఇంత త్వరలో దేశంలోనే గొప్ప పారిశ్రామిక వేత్త గా ఎదగడం సిద్దార్ద్ కు ఆశ్చర్యమే. దేశంలో కీలకమైన నిర్ణయాలు తీసుకునే ముందు ప్రభుత్వం మాట్లాడే ముఖ్యమైన పారిశ్రామిక వేత్తలలో పి.ఎల్. టాప్ లో ఉంటాడు.

భోజనాల కి మహేష్ ను కూడా పిలిచాడు పి.ఎల్. భోజనాలకి టేబిల్ చుట్టూ కూర్చుంటే, యూనిఫామ్ వేసుకున్న సేవకులు ఒక ప్లేట్ వంటకం తరువాత ఒకటి పెడుతున్నారు. గ్లాసులు ఖాళీ కాకుండా నింపుతున్నారు.

"కెన్ ఫిల్మ్ ఫెస్టివల్ కి వెళ్లారు కదా. ఫోటోలు మ్యాగజైన్ లో చూసాను. అదీ మీ కూతురు రీమ, రెడ్ కార్పెట్ మీది డ్రెస్ లు అద్భుతంగా ఉన్నాయి", అంది కనిచెల్వి.

రీమ చిరు నవ్వు నవ్వింది.

" అవును కెన్ ఫెస్టివల్ సమయంలో ఫ్యాషన్ ప్రొడక్ట్స్ అమ్మేవారు మా వెంట పడుతూ ఉంటారు, వాళ్ళ దుస్తులు, నగలు, వాచీలు లాంటివి వేసుకోమని. ఇక మమ్మల్ని ఫోటో షూట్ చేయడానికి కూడా ఏర్పాట్లు జరిగి పోతాయి. మాకు అదో అసెంబ్లీ లైను ఎక్కినట్లే. వి గో థ్రు ది మోషన్స్. అన్నట్టు అక్కడ అనేక బిజినెస్ డీల్స్ కూడా జరుగుతాయి. మీకు తెలియనిది కాదు. కానీ కొన్ని పెద్ద ప్రాజెక్టులకు ఇక్కడి ప్రభుత్వం నుంచి అనుమతి కావాలి. ఆ విదేశీ ప్రోజెక్టుల నుండి వచ్చిన డబ్బును, ఇండియాకి తెప్పిస్తే సగం పైనే, టాక్స్ లకి పోతాయి", అన్నాడు సిద్దార్ద్.

పి.ఎల్. నుంచి ఏమైనా సలహాలు దొరుకుతాయేమోనన్న ఆలోచనని, సిద్దార్ద్ ముఖంలో పసి కట్టాడు పి.ఎల్.

సిద్దార్ద్ కి దేశంలో ఉన్న గొప్ప వాళ్ళ క్లబ్ ఒకటి ఉందని తెలియదు. పి.ఎల్. తన పరిశ్రమలు విస్తరించే ప్రయాణంలో ఈ క్లబ్ లో చేరే అర్హత ఇదివరకే సంపాదించేసాడు. ఈ గుంపులో ఉన్న వారు మాట్లా డుకొనే విషయాలు బయటికి పొక్కవు.

పి.ఎల్. మహేష్ వైపు చూసాడు. సిద్దార్ద్ ఈ గుంపులో చేర్చుకువచ్చు నన్న సంకేతం పి.ఎల్. చూపులలో కనిపించింది మహేష్ కు.

"సిద్దార్ద్ గారు మాకు జినీవాలోను పనామా సిటీలోను కొంత మంది ఆర్థిక మాంత్రికులు ఉన్నారు. నేను పరిచయం చేయించగలను", అన్నాడు మహేష్.

"మా అకౌంటెంట్ కి చెప్తాను, మీ స్టాఫ్ ను కలవమని. నాకు, నా కూతురికి, ఇద్దరికి కెన్ లో ఉన్నప్పుడు హాలీవుడ్ సినిమాలలో ఆఫర్స్ వచ్చాయి. రెండూ మెగా ప్రాజెక్టు లే", అన్నాడు సిద్దార్థ్.

అలా కబుర్లతోనే సమయం ఇట్టే గడిచిపోయింది. సిద్దార్ద్ కుటుంబం వెళ్లేటప్పుడు, కొన్ని ఫోటోలు కనిచెల్వి ముందే ఏర్పాటు చేసినందు వల్ల , పి.ఎల్ కుటుంబంతో పాటు తీసారు, ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్..

అందరూ వెళ్లి పోయిన తరువాత పి.ఎల్. , మహేష్ లు పి.ఎల్. ఆంతరగికుల కోసం అని తన కోసమే కట్టు కున్న టాప్ ఫ్లోర్ కి వెళ్లారు. చంద్రుడు వెలిగి పోతున్నాడు. ఒకటి రెండు కంటే ఎక్కువ పిల్ల మేఘాలు లేవు. చంద్రుని వెలుగులో చుట్టూ పక్కలలో ఉన్న గుడిసెలు, వాటి నుంచి వెలుగుతున్న గుడ్డి దీపాల్లాంటి ఎలక్ట్రిక్ బల్బులు బూడిదలో నుంచి వెలుగుతున్న నిప్పు కణాల్లా ఉన్నాయి.

ఫ్లోర్ అంతా మెత్తటి వెలుగు ఉండటం వల్ల ఇంట్లోనూ నీలి వెన్నెల కాంతులున్నట్లు భ్రమింప చేస్తున్నది. అక్కడక్కడ మూలలో , టేబిళ్ల పైన ఉన్న దీపాలు, పని చేసుకోవాలంటే ఇక్కడ రండి అని ఆహ్వానిస్తున్నాయి. పి.ఎల్. తన ఆఫీసు రూము కు దారి తీసి, మహేష్ ను కూడా ఎదురుగా కూర్చో మని సంజ్ఞ చేసాడు.

"సిద్దార్ద్ తో బాగానే చెప్పావు, కానీ నాకే సందేహంగా ఉంది. ఈ మధ్య ప్రభుత్వం లో ఏమి జరుతున్నదో తెలుసుకోవడం లో కొంత వెనుకంజ వేసామనిపిస్తున్నది. నీకు గుర్తుందా కొన్ని ఏండ్ల క్రితం, అరసు వీడ్కోలు పార్టీలో వినోద్ సైప్రెస్ లో మన అకౌంట్ల గురించి మాట్లా ాడాడు. వినోద్ కు ఆ విషయం ఎలా తెలిసిందో , తెలుసా?", అడిగాడు పి.ఎల్.

"వాకబు చేసాను. ఆ మధ్య అంతర్జాతీయ లెవెల్ లో కొన్ని కొత్త పరిణామాలు జరిగాయి, అని విన్నాను. దాని పర్యవసనం ఇది కావచ్చు. బెల్జియం విదేశి విభాగం ఎగ్ మాంట్ ప్యాలస్ లో నుంచి పని చేస్తుంది. వాళ్ళు ఆ మధ్య కొన్ని దేశాల ప్రతినిధుల తో ఓ మీటింగ్ పెట్టారు. టాక్స్ ఎగవేతలు, నల్ల ధనం పట్టుకోవడానికి ఉన్న ప్రభుత్వ శాఖ ప్రతినిధుల తో 'ఎగ్ మాంట్ గ్రూప్' అని ఓ కొత్త సంస్థ ఆరంభించారు. పరస్పర ప్రభుత్వ సహకారం తో , నల్ల ధనం టాక్స్ ఎగవేతలు, టెర్రర్ ఫైనాన్సింగ్ ఆపాలని ఈ గ్రూపు ఉద్దేశ్యం. భారత్ దేశం కూడా ఈ గ్రూప్ లో చేరింది. వినోద్ మన ఇన్కమ్ టాక్స్ కమిషనర్ కాబట్టి, సైప్రెస్ గురించి ఈ గ్రూప్ ద్వారా తెలిసి ఉండవచ్చు", అన్నాడు మహేష్

"సైప్రెస్ ప్రభుత్వం ఒక వేళ ఈ గ్రూప్ మెంబెర్ అయ్యినా ఆ దేశం నుంచి ఈ విషయం బయట పొక్కడం సాధ్యం కాదు. జినీవా లాయర్లు పి.ఎల్ గ్రూప్ పేరు పైకి రాకుండా ఓ రెండు ట్రస్ట్ కంపెనీలు, ఓ సైప్రస్ ప్రైవేట్ కంపనీ , మన సైప్రస్ కంపెనీ ఓనర్స్ గా పెట్టారు. సైప్రస్ ప్రైవేట్ కంపెనీ ఈ ట్రస్ట్ కంపెనీ దని రికార్డుల లో ఉంది. కానీ ఆ ట్రస్ట్ కంపెనీ మరో ట్రస్ట్ కంపెనీ దని, ఆ మూడు బినామీ కంపెనీలు మనవని ఎక్కడ రికార్డ్ లేదు. ఎక్కడో ఏదో తేడాగా ఉంది", అన్నాడు పి.ఎల్. అనుమానంగా.

"నాకు అదే సందేహం వచ్చింది, సార్. కానీ మన గ్రూప్ పేరు ఈ కంపెనీ ల ద్వారా బయట పడే ఆస్కారం లేదు. ఇటలీ ఎక్స్పోర్ట్ పార్టనర్ మన లియో ఓ సారి తన వాళ్ళు లేరంటే, మన జినీవా ప్రతినిధి, వాళ్ళ కంపెనీ డైరెక్టర్ గా

సంతకం పెట్టాడు. అది మనం లియో ను ఆదుకోవడానికి చేసాం. ఆ కంపెనీ అకౌంట్లు తైవాన్ బ్యాంక్ లో ఉన్నాయి. ఎగ్ మాంట్ గ్రూప్లో, అమెరికా సంయుక్త రాష్ట్రాలు కూడా  మెంబెర్. వారు ఫైనాన్సియల్ క్రైమ్ ఎన్ఫోర్స్మెంట్ నెట్వర్క్( ఫిన్ సెన్) అన్న ఓ సంస్థ ద్వారా ఎగ్ మాంట్ గ్రూపు ఇతర సభ్యులతో సంప్రదిస్తూ ఉంటారు. అమెరికా రిజర్వ్ బ్యాంక్ తైవాన్ బ్యాంక్ రికార్డ్ లు పరిశీలించి నప్పుడు, ఆ బ్యాంక్ లో చాలా అవక తవకలున్నాయని పెద్ద ఫైన్ వేసింది. అప్పుడు బయట పడిన రికార్డులలో మన జినీవా ప్రతినిధి పేరు ఇటలీ కంపెనీ తో జోడై ఉండడం చూసి ఉంటారు, అని నా అనుమానం. అదే విషయం భారత దేశానికి అంద జేసీ ఉంటారు", అన్నాడు మహేష్.

"నువన్నది లాజికల్ గానే అనిపిస్తున్నది. కానీ ఇది కార్పెట్ కింద తోసివేసే చిన్న విషయం కాదు. ఓ సారి జినీవా వెళ్లి మన కంపెనీ కి సహాయ పడుతున్న లాయర్ లను కలవు", అన్నాడు విశ్వం.

"సరే సార్", అంటూ వీడ్కోలు తీసుకున్నాడు మహేష్.

"మరో మాట. అరసు సెలవులని ఇక్కడికి వచ్చేటప్పుడు, వాడి టికెట్ జినివాలో స్టాప్ ఉండేటట్లు మార్పించు. వాడిని కూడా నీ వెంట తీసుకెళ్లి జినివాలో లాయర్ల ను పరిచయం చేయి. పనామా లాయర్ల ను కూడా జినీవాకి పిలిపించి వాడికి పరిచయం చేయి. వాడు చదువు తరువాత ఇక్కడ పి.ఎల్. గ్రూప్ బోర్డులో డైరెక్టర్ చేయాలని నా ఆలోచన", అన్నాడు విశ్వం.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments